# కష్టం సుకం తెల్సినోడు!

రంధి సోమరాజు



బతకడానికి మనిషి ఏదో ఒకటి చేయాలి కదా కొందరికి ఏమీ చెయ్యక్కరేకుండానే వారి వారి తాతలు,తండ్రులు గడించినడబ్బు తలగడకింద చేయి పెడితే చాలు హాయిగా ముచ్చటగా తగులుతుంది. ఇలాంటి వారి కులాసాలు, ఉత్సాహాలు అందరికీ తెలిసినవే !

మరి కొందరి జీవితంలో నవ్వటానికే వీలులేని పరిస్థితి! అది వారి ముందు విలయతాండవం చేస్తుంది. ఎందుకు ఇలా జరుగుతుందో చెప్ప వచ్చు కాని అలా జరగకుండా చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో తలకు మించిన పనే!

గయిరమ్మ పాపం నిత్యం నెత్తిన కూరలగంప మోసుకొని ఇంటింటికి తిరిగి వాళ్ళు పెట్టే పిడికెడు పిడికెడు బియ్యం తీసుకొని కుటుంబ బాధ్యతలను రోడ్ రోలర్‌లా బరువుగా భారంగా ఈడ్చు కొస్తోంది.

ఎప్పుడూ ఆయాసమే బతుకు! భూతం లాంటి రేపును తలచుకుంటేనే ఏడుపు! భర్త అనేవాడు ఉన్నాడేకాని, చేతికి మాత్రం పైసా అంటనివ్వడు. పగలంతా రిక్షా లాగి, వచ్చిందంతా తాగేసి, ఏమైనా అంటే నాలుగు తగలనివ్వడానికి ముందు కొస్తాడు. రిక్షా చక్రం త్రిప్పడానికి పని కొచ్చే కాళ్ళను ఇంటి చక్రం తిప్పు కొస్తున్న పెళ్ళాన్ని తన్నడాని కుపయో గిస్తాడు. బతకడం గురించిన ఆలోచన అతనికేనాడూ లేదు. నరాలమీద గజ్జి కురుపులా సలుపుతోన్న బతుకును ఎలా గోలా గయిరమ్మ యింటింటికీ కూరలమ్మి బతుకుతూ దిన దినం కృంగిపోతూ బెంగ పడిపోతూ చిక్కి శల్యమై పోతుంది.

దీనికితోడు కూరలుకొనడానికి కావలసిన ఐదూ, పది కూడ చేతిలో ఉండటం లేదు. అప్పు కోసం వెళ్తే నాయుడు అయిదు ఇచ్చి వడ్డీ రూపాయి ముందే లాగేసు కుంటాడు. నిత్యం గయిరమ్మ పాతిక రూపాయల సరుకు కొనవలసి ఉంటుంది. సాయంకాలం మిగిలిన కూరలు ఎంతకో అంతకు తగ్గించి పారేస్తే మిగిలేది హళ్ళికి హళ్ళి. సున్నకు సున్నా. దారిలోనే కాసి, పాతిక రూపాయలూ నాయుడు గుప్పున లాక్కొని పోతాడు. చేతిలో ఏమైనా మిగిలితే బియ్యం కొనడానికి ఉప్పు కొనడానికి రాదు. మధ్యలో ఈ అప్పుల దగారిగొప్పగాబతుకుతున్నాడు గయిరమ్మ లాంటి శవాలమీద వాడు బట్టకడుతున్నాడు!


చీకటినే బయలుదేరి, ఇంటింటికీ అడుగు పెట్టి పది గంటలలోగానే సరు కంతా అమ్మేసుకోవాలి. ఈ వైజాగ్‌లో ఎత్తులు ఎక్కుతూ, పల్లానికి దొర్లుతూ పదిళ్ళు తిరిగేప్పటికి, పై ప్రాణాలు పైనే పోతాయి.


ఒక యింటికి బెల్ నొక్కాలి. ఒక యింటి లోపల ఉన్న ఆవిడకి వినబడేలా అరవాలి. మామగారికి చెప్తే మనవడికి పురమాయిస్తాడు. ఆ బుల్లోడు లోపలిగదిలో చెయ్యి కాళీగా లేని నాయనమ్మకు చెప్పి ఆవిడ్ని లాక్కొచ్చేసరికి సుక్కలు పొడు స్తాయి ఆ వచ్చిన తల్లి గీసిగీసి బేరమాడి అర్ధ రూపాయ సరుకు కొనేసరికి పేనాలు గిల గిల్లాడి పోతాయి. అందరూ ఇలా అయితే గయిరమ్మ ఎన్ని ఇళ్ళు తిరగ్గ లను? అయింటి కొత్త కోడలు మంచిదే! బేరమాడకుండానే కొంటుంది. అందరూ ఇలాంటివాళ్ళయితే ప్రాణానికెంత సుఖం! ఎడారిలో సెలయేళ్ళులా తగుల్తారు ఎప్పుడో.... అప్పుడే యింత సుఖం. మళ్ళీ మామూలే....

ఓ అమ్మ పిడికెడు నూకల్లాంటి బియ్యం పోసి గుప్పెడు కరేపాకు కావా లంటుంది. "ఇదేమిటి తల్లీ. కసిన్ని కూడ బియ్యం లేవు అన్నీ నూకలే...." అంటే—"మేం నూకల కూడు తింటున్నా మనుకున్నావా....?" అంటూ కయ్యాని కొస్తుంది. దెబ్బలాడుతూ కూచోడానికి గయిరమ్మకు ఓపికేదీ. సమయమూ లేదు. తొందర తొందరగా కదలక పోతే మరో రావమ్మ గద్దలా తన్నుకు పోతుంది. వాడిక పోగొట్టుకుంటే కాటికి పోవాల. క్షణక్షణమూ భయమే.... పోటీ.... పోటీ... క్షణానికి క్షణానికీ పోటీ.... ఈ చక్రంలో పడి నలిగి పోవలసిందే.... మరి బయట పడే మార్గం లేదు

ఇలా వుండగా ఓరోజున బంధువుల యింటికి వాల్తేరు వెళ్తూ విజయనగరం పేలెస్ ప్రక్క కొత్తగా కట్టిన యింట్లో ఓ దొరగారు ప్రవేశిస్తూ వుండటం గయి రమ్మ చూసింది. ఆ రాత్రి గయిరమ్మకు తీయని కలలు వచ్చాయి. అక్కయ్య పాలెంలో కూరలమ్మడం మానేసి ఇక రేపటి నుంచి పెదవాల్తేరులో దొరగారికి కూరలమ్మాలని నిశ్చయించుకుంది. దొరల కయితే బేరసారాలుండవు. ఎంతంటే అంత. కిర్లంపూడిలో ఆదెమ్మ దొరలకు కూరలమ్మి ఇల్లే కట్టింది. ఆ సంగతి గయిరమ్మ కళ్ళ ముందు లీలగా మెరిసింది. ఇల్లు కట్టక్కర్లేదు.... బతుకెళ్ళి పోతే సాలు.... అనుకుంది.

మరునాడు చీకటినే లేచింది. సూరి దేవుడికి సేతులెత్తి దండం పెట్టింది.... 'దేవుడా నువ్వే ఆదుకోవాలి' అంది. గుట్ట మీద వున్న దొరగారింటికి చేరేసరికి గుండెలనిండా ఆయాసం! దొరయిల్లుకొత్త. ఆ ఎత్తు కొత్త.... ఆయాసం అణుచుకో లేని స్థితి కొత్త. అదుపులోకి తెచ్చుకోలేని ఈ ఆరాటం కొత్త! చుట్టూ సముద్రం ప్రశాంతంగా పరచుకొని ఉంది. మనో






హరమైన ఆ దృశ్యం ఏమీ తెలియని గయిరమ్మను కూడ ఆహ్లాదపరచింది. నుదుట పట్టిన చెమటతో మనసు హాయిగా కదిలింది. గయిరమ్మ చేయి కాలింగ్ బెల్ మెల్లగా నొక్కింది. భయం భయం.... ఏమి జరుగుతుంది....ఏమి జరుగుతుంది.. ....ఆతృత....ఆతృత....అప్పుడే శబ్దం కాకుండా తలుపు తెరచుకుంది. ఆ పెద్ద గుమ్మాన్ని మించిపోయినట్లున్న తెల్లటి పొడుగాటి వలంగా బలంగా వున్న మనిషి "వాట్?" అన్నాడు. ఆదొరను చూడగానే గయిరమ్మపై ప్రాణాలు పైనే పోయాయి. ఏమీ తోచలేదు 'కావాలా బాబూ' అన్నట్టు చేయి దానంతటదే గంపలోని కూరల్ని చూపుతూ నటనగా తిరిగి పోయింది. కంఠం పెగల్లేదు. గయిరమ్మ నుదుట చెమటలు, చెమటలు. అటు సముద్రం మీద తళతళ మెరిపి పోతూన్న సూర్య కిరణాలు....

దొర ఇలా వచ్చిన వాడు అలా వెంటనే గదిలోకి వెళ్ళిపోయాడు. లోపల ఉన్న వంట మనిషిని పిలిచి బయటకు పంపిం చాడు. ఆ వంటావిడను చూడగానే గయిరమ్మ మళ్ళీ బెంబేలు పడిపోయింది. అయినా ధైర్యంగా రెట్టింపు ధరలు చెప్పి, కావలసిన సరుకులన్నీ యిచ్చింది. ముందుగానే గయిరమ్మ కాబేజి కాలీఫ్లవరు, బీట్ రూటు, బీన్స్, టమాటాలు మొదలయిన ఇంగ్లీషు కూరలు జాగ్రత్తగా ఆలోచించి తెచ్చింది. ఆ వంట మనిషి అన్ని కూరలూ తీసుకుంది. డబ్బు గురించి ఏమీ మాట్లాడలేదు. లోనికి పోయి పదిహేను కొత్త రూపాయి నోట్లు తెచ్చి యిచ్చింది. ఇస్తూ, "దొరగారి స్నేహితుడు కిర్లంపూడిలో వున్నారు. వారికి కూరలు ఇవ్వు...." అంది. ఆ యిల్లు ఎక్కడో ఆ వయినం చెప్పింది. గయిరమ్మ నక్కను తొక్కి వచ్చినట్లు భావించింది. "ఫోను చేసి చెపుతారులే వారికి" అంటూ వంట మనిషి లోనికి వెళ్ళిపోయింది— "అలాగే తల్లీ.... ...." అంటూ గయిరమ్మ తిన్నగా కిర్లంపూడి వెళ్ళి ఆ దొరగారికీ కావలసిన కూరలు యిచ్చింది. మిగిలిన కూరలు వీధిలో అటు తిరిగి, ఇటు తిరిగి వారికి వీరికి అమ్మి సొమ్ము చేసుకుంది.

వారం పదిరోజులు తిరిగే సరికి గయిరమ్మ చేతిలో కావలసినన్ని డబ్బులాడుతున్నాయి. అప్పులు గాలికెగిరి పోయినట్లు ఎగిరి పోయాయి. గయిరమ్మ సుతారంగా తయారౌతోంది. శుభ్రమైన బట్ట కడుతోంది. దొరల ఇళ్ళకు ఇవ్వగా మిగిలిన కూరలు మరీ అంత పెచ్చు ధరకు అమ్మకుండా కొంచెం తగ్గించి అమ్ముతూ ఆ వీధిలోవారి మన్ననలూ పొందింది.

ఈ మధ్య గయిరమ్మ తన దగ్గర అప్పుగా ఏమీ పుచ్చుకోక పోవడం నాయుడు గమనించాడు. రోజుకు పది, పదిహేను రూపాయల ఆదాయం పడిపోవడంతో మనసులో గొల్లుమని పోయాడు. దీనికి యింత డబ్బు ఎక్కడి నుండి వస్తోంది అనుకున్నాడు. పొరపాటున గాని గయిరమ్మ మొగుడు తాగుడు మానేకాదా....అని ఆలోచనలో పడి పోయాడు. కాని అదీ నిజం కాదని తేలిపోయింది ఈ మధ్య మా సొగ్గా అన్తోంది. ఎవడ్నైన పట్టిందేటి.... అని తిరకాసుఆలోచనలో మునిగిపోయాడు. ఛీ....ఇది కాదు కాని.... అది వోడికి కూరలమ్ముతోందో ఆరా తీస్తే అంతా బయటకి పోతాది అనుకున్నాడు. ఎగయిరమ్మో్మదినా....ఈ మద్దె బొత్తిగా జూడనేదు. ఆవు పేదై పోనావు, ఏటి గిరాకీ...." అన్నాడు.

"గిరాకీ నేదు గడ్డీ నేదు. దబ్బవసరం పడ్నేదు. మీఅన్న తాగుడు తగ్గించేసినాడు. ఏదో ఆదేవుడి పున్నేన నాలుగేళ్ళా నోట్లో కెల్తున్నాయి. నేక పోతే నువ్వే కదరా దిక్కు...." అంది.

నాయుడు గయిరమ్మను నమ్మలేక పోయాడు. ఆ సాయంకాలం దాని మొగుడు తప్పతాగి వస్తూండటంచూశాడు. ఇందులో వున్న నిజం బయట పడితే కాని నిద్దరో గూడదనుకున్నాడు.

మరునాడు గయిరమ్మ అమ్మే స్థలాల ఆచూకీ తీశాడు. 'అమ్మ దొంగా ...' అనుకున్నాడు.

సింగమ్మను టాకు టీకుగా మాయమగా తయారుచేసి దొరగారి యింటి ముందు నిలిపాడు. దూరాన సింగమ్మను చూసి గయిరమ్మ లబలబలాడి పోయింది. 'ఈ నంజకునానేటి సేసాను ... నాకూటిలో మట్టోత్తోంది.' గుబ గుబలాడి పోతున్న గుండెతో ఆ గుట్ట ఆదరా బాదరాగా ఎక్కింది.

ఈలోగా వంట మనిషి తలుపు తీసి గయిరమ్మకు బదులు మరొకరిని చూసి, "ఏం ఇవాళ గయిరమ్మ రాదా...." అంది.

"అది మా పిన్నమ్మే నండి. ఒంట్లో నలతగా వుంది. ఇయ్యాల నువ్వెల్లే అంటే వొచ్చాను...." అంది.

ఇంతలో గేటు దగ్గరకు గయిరమ్మ వచ్చి పడింది. "అది దొంగ నంజ తల్లీ.... ఇదెవతో నాకు తెల్దు" అంటూ ముందు కొచ్చింది.

వంటావిడకు ఆ యిద్దరిలో ఎవరి

దగ్గర కొనాలో తోచలేదు. గయిరమ్మ కన్న ఆ కొత్త పిల్ల చాల చవగ్గా యిస్తానం టోంది. లోనికి పోయి వెంటనే దొరను పిలుచుకొచ్చింది.

సింగమ్మ తన దగ్గరున్న కూరలవేపు చేయి చూపి "చీప్ సర్ ...." అంది.

గయిరమ్మ వేపు దొర గుడ్లురిమి చూశాడు. పాపం గయిరమ్మ దుఃఖం పెల్లుబికింది. ఒక్కసారి బావురమని పోయింది.

"శెమించండిబాబూ.... తప్పయిపోనాది. ఈ నంజి బావ నాయుడండి. ఆడు మమ్మల్నింత ముద్ద ముట్టనీ లేదండి. వడ్డీపేరుతో జలగనా పీల్చేసినాడండి. పొద్దుటేల అయిదప్పిచ్చి వడ్డీగా రూపాయి నాగేసుకునీవోడండి. సందాల గెద్దనాగొచ్చి ఆ అయిదూ వొడికేసుకునీవోడు. అయిదు రూపాయలకి రొండు రూపాయలు. వోడి సంసారం నిలబడద్ది? ఆడు మమ్మల్ని జుర్రీసినాడు బాబూ .... జుర్రీసినాడు. అయ్యేల తమరు దేముడ్నా ఆపడినారు. తమకు కూరలమ్మి బతుకులో దీపమెట్టుకోవాలనుకున్నాను. తమ టోటోలికి దరల వొయినం తెలీకుండ వుంటందా అనుకున్నాను. అడిగినంతా తమరిచ్చారు. నాలుగేళ్ళా యియ్యాల నోట్లోకెల్తున్నాయి. ఈ బాబు సల్లగుండాలని నిత్తెం దేవుడికి దండం ఎట్టుకుంటాన్నాను-ఇయ్యాల నా కూట్లో దుమ్మెయ్యడానికి దీన్ని ఆనాయుడు గాడంపినాడు. తమరి దయ బాబూ...." అంది.

ఇదంతా వంటావిత తర్జుమా చేసి దొరకు చెప్తానే వుంది.

గయిరమ్మవేపు దొర సానుభూతితో చూశాడు.

కొత్త పిల్లవేపు గుడ్లురిమి చూశాడు.

గట్టిగా "గెటవుట్" అని అరిచాడు.

దొరకు గయిరమ్మ వంగి దండం ఎట్టింది.

ఆ బాబు కొత్తగా ఆయువు పోసినట్లు గాలి పీల్చింది.

"కట్టం సుకం తెల్సిన బాబు. దబ్బు వోడికి సేదు! అయినా దయగల బాబు. అందుకే దాన్ని తోలేసినాడు. బగమంతుడు........ ఈ బాబు నిజంగా బగమంతుడు." అనుకుంటూ గయిరమ్మ తృప్తిగా యింటికి దారి తీసింది. ●

# మహాప్రతిష్ఠానం

అరే ప్రకాశం
ఒరే గణేశం
ఆకలి లోకం పిలిచింది!

పదండి ముందుకు
పదండి తిండికి
పోదాం పోదాం హోటల్‌కి!

దిక్కులు చూస్తూ
కాళ్ళీడిస్తూ
కాలే కడుపును ఓదారుస్తూ
పదండి పోదాం
కనబడలేదా
భోజనహోటల్ తాజమహల్?

ముద్ద ముద్దకూ ఒట్టలు వేస్తూ
పట్టెడు పట్టెడు ముద్దలు చేస్తూ
పప్పుని ఒకడూ
కూరని ఒకడూ
పోటీపడుతూ తినరండీ!
ఉర్లగడ్డలూ,
వొడియాలూ, నే
తప్పడాలు మనకెక్కసమా?
తినండి బాగా
తినండి యింకా
తినలేమని యిక అనకండి!

కొబ్బరి చట్నీ
కొత్తిమీర కారం
సర్వరులారా! తేరండీ!
మజ్జిగపులుసు
గొంతుక దాకా
గుటగుట గుటగుట తాగండీ!
"భలే భలే భలె!
భలే! బలె! బలె!
బ్రేవు బ్రేవు"మని త్రేన్చండీ!
మరి యింకొంచెం
మరి యింకొంచెం
మరీ మరీ మరి తినరండీ!
తినండి బాగా!
తినండి యింకా!
మళ్ళీ మళ్ళీ తెప్పించండీ!
ఏవీ లేవనిపించండీ!
క్షామదేవతా స్నేహబృందమై
కరకర కరకర విరుచుకు తినండి!
తినండి
తినండి
తినండి యింకా!
తృప్తిపడిందా మీలో దాగిన
చురచుర రగిలే జఠరాగ్ని!!
ఎగసి, ఎగిసి, ఎగసిరావాలోయ్

ఎనభై ఎనిమిది త్రేనుపులు!
అరిగి, అరిగి, అరిగి పదార్థాల్
తిరిగి ఆకలని అరవాలోయ్!
మాములు మనుషుల కడుపా? మనది
క్షుద్బాధేశుడి ముడుపు!
హోటల్ జనాలు
తారెత్తాలి!
సర్వరు ప్రాణం స్తంభించాలి!
యజమానుల కిక
ఏమీ తోచక
గడగడ గడగడ వణకాలి!
తినవద్దని బ్రతిమాలాలి!
వృకోదరుని వలె
బకాసురుని వలె
ఘటోత్కచునివలె తినరండీ!
బావున్నాయా! పప్పుపులుసులో
ములక్కాడలూ, చిలగడలు!
వస్తున్నాయా ఎక్కిళ్ళు?
అవుగో ప్రక్కన మంచీళ్ళు!

(శ్రీశ్రీ "మహాప్రస్థానాని"కి పారడీ)

—జొన్నవిత్తుల
రామలింగేశ్వరరావు ●